# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-11-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **మహారాష్ట్రలో అభివృద్ధి, సుపరిపాలన, నిజమైన సామాజిక న్యాయమే గెలిచాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.**

2. **ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని సంపద సృష్టికి కేంద్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు.**

3. **మహబూబ్‌నగర్‌లో ఈ నెల 30వ తేదీన జరగనున్న రైతు సదస్సులో రాష్ట్రంలోని రైతులంతా పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.**

4. **ప్రజారోగ్య పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు.**

5. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" కార్యక్రమం ఈ ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.**

============================

మహారాష్ట్రలో అభివృద్ధి, సుపరిపాలన, నిజమైన సామాజిక న్యాయమే గెలిచాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఢిల్లీలోని భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో నిన్న ఆయన మాట్లాడుతూ.. మహారాష్ట్రలో గత 50 ఏళ్లలో ఏ పార్టీ గానీ, ఎన్నికల ముందు ఏర్పాటైన కూటమిగానీ ఇంతటి ఘన విజయం సాధించలేదన్నారు. వరుసగా మూడుసార్లు బీజేపీకి అధికారం అందించిన ఆరో రాష్ట్రంగా మహారాష్ట్ర నిలిచిందని తెలిపారు. హరియాణా ఎన్నికల తర్వాత మహారాష్ట్ర నుంచి వచ్చిన అతిపెద్ద సందేశం ఐక్యతేనని పేర్కొన్నారు. ఐక్యంగా ఉంటేనే సురక్షితంగా ఉంటాం అనే నినాదమే ఇప్పుడు దేశానికి మహా మంత్రంగా మారిందని ప్రధానమంత్రి వివరిస్తూ...

..వాయిస్ (27 సెకన్లు)

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని సంపద సృష్టికి కేంద్రంగా తీర్చిదిద్దడమే రాష్ట్రప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. నవీ ముంబయి అభివృద్ధిలో కీలకమైన మహారాష్ట్ర నగర, పారిశ్రామిక అభివృద్ధి సంస్థ..సిడ్కో ప్రతినిధులతో విజయవాడలోని సీఆర్డీఏ ప్రధాన

కార్యాలయంలో నిన్న ఆయన సమావేశమయ్యారు. నవీ ముంబయిలో చేపట్టిన భూసేకరణ విధానం, కొత్తగా నిర్మించే నగరానికి కావాల్సిన వనరుల సమీకరణ, భూ వినియోగం ద్వారా వచ్చిన నిధులతో అమలు చేసిన ఆర్థిక ప్రణాళికను.. సిడ్కో ఎకనామిస్ట్ డాక్టర్ షేక్, విశ్రాంత ఆర్థిక నిపుణులు కల్యాణ్కర్ మంత్రికి వివరించారు. ఈ సమావేశంలో పురపాలకశాఖ కార్యదర్శి కె.కన్నబాబు, రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ.. సీఆర్డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్, అదనపు కమిషనర్ మల్లారపు నవీన్ పాల్గొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం తలగాసుపల్లె వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. కుట్లూరు మండలం నెల్లుట్ల గ్రామానికి చెందిన 12 మంది వ్యవసాయ కూలీలు పని ముగించుకుని ఆటోలో గార్లదిన్నె నుంచి తిరిగి వెళ్తుండగా.. ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఆటోను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోగా ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులకు అనంతపురంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు 5 లక్షల రూపాయల చొప్పున ముఖ్యమంత్రి పరిహారం ప్రకటించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత పరామర్శించారు. ఈ ఘటన చాలా బాధాకరమని, క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్స అందిస్తున్నామని మంత్రి తెలిపారు.

---------------------------

ప్రజా ప్రభుత్వ విజయోత్సవాల్లో భాగంగా మహబూబ్‌నగర్‌లో ఈ నెల 30వ తేదీన జరగనున్న రైతు సదస్సులో రాష్ట్రంలోని రైతులంతా పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ సభను బహిరంగ సభలా కాకుండా.. రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమంలా నిర్వహించాలని సూచించారు. వ్యవసాయ శాఖపై నిన్న ఆయన సమీక్ష నిర్వహించారు. వ్యవసాయంలో వచ్చిన అధునాతన సాగు పద్ధతులు, మెలకువలను రైతులకు తెలియజేసేలా వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం అభివృద్ధి చేసిన కొత్త వంగడాలు, ఆయిల్ పామ్ కంపెనీల నూతన ఆవిష్కరణలు, వివిధ కంపెనీల వినూత్న ఉత్పత్తులన్నీ స్టాళ్లల్లో ఉంచాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

---------------------------

తెలంగాణలో మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో 3 వేల 747 కోట్ల రూపాయలను మహిళలు ఆదా చేసుకున్నారని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీ, రవాణాశాఖలపై నిన్న ఆయన వేర్వేరుగా సమీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ఏడాది డిసెంబరు నుంచి ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో ఒక వెయ్యి 389 కొత్త బస్సులు ఆర్టీసీకి సమకూరాయని తెలిపారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా మరిన్ని కొత్త బస్సుల్ని ప్రవేశపెట్టాలని సూచించారు. మొదటి విడతలో మహబూబ్‌నగర్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల మహిళా స్వయం సహాయక సంఘాల నుంచి ఆర్టీసీకి అద్దె బస్సులను తీసుకుంటామని మంత్రి వివరించారు.

---------------------------

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నిన్న ఆయన భద్రాచలం ఆలయ అభివృద్ధిపై అధికారులతో చర్చించారు. అనంతరం సీతారామచంద్ర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత భద్రాచలంలోని ఏఎంసీ

కాలనీలో గతంలో నిర్మించిన రెండు పడకల ఇళ్లను మంత్రి పరిశీలించి... జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ భద్రాద్రి ఆలయాన్ని అభివృద్ధి చేసే కార్యక్రమంలో భాగంగా మొదటి విడత 68 కోట్ల రూపాయలతో స్థల పరిశీలన పనులు త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు.

---------------------------

ప్రజారోగ్య పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు వైద్య కళాశాల ఆడిటోరియంలో భారత వైద్య సంఘం.. ఐఎంఏ ఆంధ్రప్రదేశ్ 66వ వార్షిక సమావేశానికి విశిష్ట అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. మన దేశంలో వైద్య వృత్తి ప్రాధాన్యాన్ని కొవిడ్ తెలియజేసిందని, ఆ సమయంలో వైద్యులు అందించిన సేవలు మరువరానివని అన్నారు. ప్రస్తుతం మన దేశంలో వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను, పరిష్కరించేందుకు కృషి చేస్తానని కేంద్ర సహాయ మంత్రి చంద్రశేఖర్ పేర్కొంటూ...

..వాయిస్ (30 సెకన్లు)

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 116వ సంచిక ఈరోజు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

---------------------------

బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని, ఇది పశ్చిమ-వాయవ్య దిశగా పయనిస్తూ రేపటికి వాయుగుండంగా బలపడే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రానున్న 24 గంటల్లో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని, ఉత్తర కోస్తాలో పొడి వాతావరణం కొనసాగుతుందని పేర్కొంది. కాగా.. వాయుగుండం తీరం దిశగా వచ్చే సమయంలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరి కోతలు కోసే రైతులు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు, కొండ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

---------------------------

ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్ తరహాలో ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే సంక్రాంతి సమయానికి ట్రేడ్ ఫెయిర్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల కార్యదర్శి ఎస్‌సీఎల్ దాస్‌కు రాష్ట్ర ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. ఈ మేరకు విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలో ట్రేడ్ ఫెయిర్‌ను ఏర్పాటు చేస్తామని కేంద్ర కార్యదర్శి హామీ ఇచ్చారని చెప్పారు. ఢిల్లీలోని భారత మండపంలో జరుగుతున్న ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్‌లోని ఆంధ్రప్రదేశ్ పెవిలియన్‌ను మంత్రి నిన్న సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ పాత్రికేయులతో మాట్లాడుతూ.. ట్రేడ్ ఫెయిర్ ఏర్పాటు వల్ల ఎంఎస్ఎంఈ ఉత్పత్తులకు ప్రచారం లభిస్తుందని తెలిపారు. ప్రతి గ్రామంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను తయారు చేసేలా తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

=====================